తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
బుధవారం
23 సెప్టెంబర్ 2026
పేజీలు : 8



Follow :

# గణేష్ నిమజ్జనానికి భారీ బందోబస్తు

## పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గణేష్ నిమజ్జన మహోత్సవం అత్యంత ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతంగా ముగిసేలా అన్ని రకాల పటిష్ట భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, తెలిపారు. ?కమిషనరేట్ పరిధిలో మొత్తం 3,100 గణేష్ విగ్రహాలకు గానూ పకడ్బందీ బందోబస్తు ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. వీటిలో కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోనే సుమారు 1,000 విగ్రహాలు ఉండగా, వాటిలో దాదాపు 800కు పైగా విగ్రహాలు పట్టణ ప్రధాన రహదారుల మీదుగా నిమజ్జన కేంద్రాలకు తరలివెళ్లనున్నాయని ఆయన వివరించారు.

**ముఖ్యమైన అంశాలు, బందోబస్తు వివరాలు**

**ప్రధాన నిమజ్జన కేంద్రాలు**

మానకొండూర్ చెరువులో నగర పరిధిలోని దాదాపు 50% విగ్రహాల నిమజ్జనం ఇక్కడే జరగనుందని, చింతకుంట కెనాల్ లో దాదాపు 30% విగ్రహాల నిమజ్జనం ఇక్కడ జరుగుతుందని,కొత్తపల్లి చెరువు మిగిలిన సుమారు 20% విగ్రహాల నిమజ్జనం ఇక్కడ కొనసాగుతుందని తెలిపారు.

భారీ, ఎత్తైన విగ్రహాలను మానకొండూర్ చెరువు, చింతకుంట కెనాల్‌లలో నిమజ్జనం చేయడానికి క్రేన్లు, లైటింగ్ తదితర ఏర్పాట్లను పూర్తి చేశారు.

**భారీ పోలీసు బలగాల మోహరింపు**

నిమజ్జన విధుల కోసం కమిషనరేట్ వ్యాప్తంగా మొత్తం 850 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని విధుల్లో నియమించారు. ప్రధాన చౌరస్తాలు, సమస్యాత్మక కూడళ్ల వద్ద స్టాటిక్ పికెట్లు, పుషింగ్ పార్టీలతో పాటు పెట్రోలింగ్ వాహనాలు నిరంతరం పర్యవేక్షిస్తాయి. సున్నితమైన ప్రాంతాలు, ప్రార్థనా మందిరాల వద్ద ప్రత్యేక బందోబస్తు, ఎత్తైన భవనాలపై రూఫ్‌టాప్ పార్టీలను ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు స్ట్రైకింగ్ ఫోర్స్, రిజర్వ్ ఫోర్స్ బలగాలను రంగంలోకి దించారు.

**అంతర్ - శాఖల సమన్వయం, భద్రతా ఏర్పాట్లు**

జిల్లా కలెక్టర్, మున్సిపల్ అధికారులు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. చెరువుల వద్ద పటిష్టమైన బారికేడింగ్, రాత్రి సమయాల్లో సరిపడా విద్యుత్ దీపాలు, గజ ఈతగాళ్లు, విపత్తు నివారణ బృందాలకు చెందిన బోట్లను సిద్ధంగా ఉంచారు.

**ట్రాఫిక్ మళ్లింపులు, ఆంక్షలు**

కరీంనగర్ - వరంగల్ జాతీయ రహదారి పై మానకొండూర్ వెలుపల (ఔట్‌స్కర్ట్) భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నారు. మానకొండూర్ చెరువు వైపు ఎలాంటి భారీ వాహనాలను అనుమతించరు. జగిత్యాల మార్గం నుంచి వచ్చే భారీ వాహనాలపైనా ఆంక్షలు ఉంటాయి. వెల్చాల క్రాస్ రోడ్ వద్ద వాహనాల దారి మళ్లింపు ఉంటుంది. కొత్తపల్లి చెరువు పరిసర ప్రాంతాలలో వన్ - వే విధానాన్ని కచ్చితంగా అమలు చేస్తున్నారు. కరీంనగర్ నగరంలో గాంధీ విగ్రహం నుంచి టవర్ సర్కిల్, గంజ్, కమాన్ సర్కిల్ వరకు రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయి. పూర్తి స్థాయి ట్రాఫిక్ అడ్వైజరీని ప్రజల సమాచారం నిమిత్తం విడుదల చేస్తున్నారు.

**ప్రజలు, ఉత్సవ కమిటీలకు సూచనలు**

గణేష్ నిమజ్జన వేడుకలను శాంతియుతంగా, ఉత్సాహభరితంగా జరుపుకోవాలని, ఇతరులకు ఇబ్బంది కలగకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. డీజేలు, భారీ సౌండ్ సిస్టమ్‌ల శబ్ద తీవ్రత విషయంలో నిర్దేశిత నిబంధనలు పాటించాలి. వృద్ధులు, చిన్నారులు, ఆసుపత్రుల ప్రాంతాలలో శబ్ద కాలుష్యం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది సూచనలను తూచా తప్పక పాటించి, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీపీ గౌష్ ఆలం కోరారు.




## ఎస్జీఎఫ్ కబడ్డీ పోటీల్లో మానేరు సీబీఎస్ఈ విద్యార్థుల ప్రతిభ

### మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి

**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో జరిగిన 70వ ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి అండర్ 14 కబడ్డీ పోటీల్లో కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సీబీఎస్ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. పోటీల్లో పాల్గొన్న బి.మోహన్, సీహెచ్.దర్శన్, ఎ.రేవంత్‌లు బంగారు పతకాలతో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అభినందించారు. భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయి లో రాణించి జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతా రెడ్డి, ప్రిన్సిపాల్ రాజు చాకో, పీఈటీలు మహేందర్, స్వామి, తిరుపతి, అఖిలాష, సాయిలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అభినందించారు.

## గన్నేరువరంలో పారిశుధ్యం అస్తవ్యస్తం

### దోమల బెడదతో కాలనీవాసుల అవస్థలు

వార్త లోపలి పేజీలో

## పారిశ్రామిక ప్రాంత ప్రజలకు పట్టాలు ఇచ్చిన ఘనత వైఎస్ఆర్ ది..

○ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు..

○ రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి..




**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ పట్టాలు ఇచ్చారని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీమంత్రి కుప్పుల ఈశ్వర్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. వైయస్సార్ హయాంలో పదహారువేల పైచిలుకు పట్టాలు ఇచ్చారని గుర్తు చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో కేవలం 300 మందికి మాత్రమే ఇళ్ల పట్టాలి ఇచ్చారని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 6000 మంది కిల్లపట్టాలకు దరఖాస్తు చేసుకుంటే కేవలం 300 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని గుర్తు చేశారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ దాదాపు ఐదుసార్లు ఎమ్మెల్యేగా మంత్రిగా ఉండి స్వస్థలానికి చేసింది ఏమీ లేదని ఆయన తెలిపారు. సింగరేణి ఆస్తులను టీఆర్ఎస్ నాయకులు కొల్లగొట్టారని ఆరోపించారు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి తక్కువ అయితే ఎక్కువ చూపించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో బొగ్గు ఉత్పత్తిని ఉన్నది ఉన్నట్టు లెక్కలు చూపిస్తున్నామని అన్నారు. సింగరేణి సంస్థను టీఆర్ఎస్ నాయకులు దాదాపు 50 వేల కోట్లను దండుకున్నారని స్వామి పేర్కొన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సింగరేణి కార్మికులకు అనేక రకాలుగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని స్వామి పేర్కొన్నారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుచేసి మహిళలకు ఉచిత శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం నుంచి దాదాపు 110 కోట్లు సింగరేణి అభివృద్ధికి రాజ్ ఠాకూర్ కేటాయించే విధంగా చర్యలు తీసుకున్నారని, తద్వారా సింగరేణి ఆసుపత్రిలో క్యాథ్యులబ్ సెంటర్, మంచినీటి సౌకర్యానికి కల్పించారని తెలిపారు. కొప్పుల ఈశ్వర్ పొంతన లేని మాటలతో ప్రజలను అయోమయానికి గురి చేయడం భావ్యం కాదని ఆయన ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశంలో రామగుండం నగరపలక సంస్థ డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కాంగ్రెస్ నాయకులు బొంతల రాజేష్, మేదరబోయిన రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనం సందర్భంగా ముందస్తు బైండోవర్ చర్యలు

○పోలీస్ కమిషనర్ వెల్లడి ○జిల్లా వ్యాప్తంగా 572 మంది బైండోవర్



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 జనంసాక్షి:** వినాయక నిమజ్జనం కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఆదేశాల మేరకు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను ముందస్తుగా గుర్తించి , పోలీసు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సంబంధిత మండల రెవెన్యూ అధికారులు తహసీల్దార్ల ఎదుట హాజరుపరిచి, చట్టపరమైన నిబంధనల ప్రకారం బైండోవర్ చర్యలు చేపట్టారు.వినాయక నిమజ్జనం సందర్భంగా ఎలాంటి గొడవలు , ఘర్షణలు,అల్లర్లు లేదా ఇతర అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.నిమజ్జన మార్గాలు, ప్రధాన కూడళ్లు ,,సున్నితమైన ప్రాంతాలు మరియు రద్దీ ప్రదేశాల్లో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు.అలాగే నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరూ శాంతియుతంగా, క్రమశిక్షణతో, పరస్పర సహకారంతో వ్యవహరించాలని పోలీసులు సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజల భద్రత మరియు శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటుందని, వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని పోలీస్ కమిషనర్ సూచించారు. నిజామాబాదు డివిజన్ వ్యాప్తంగా 280 మంది బైండోవర్,ఆర్మూర్ డివిజన్ వ్యాప్తంగా 175 మంది బైండోవర్,బోధన్ డివిజన్ వ్యాప్తంగా 117 మంది బైండోవర్ చేసినట్లు తెలిపారు.

# నర్సంపల్లిలో ఇందిరమ్మ ఇంటిని పరిశీలించిన కలెక్టర్

కామారెడ్డి జిల్లా ప్రతినిధిసెప్టెంబర్ 22 (జనంసాక్షి) కామారెడ్డి మండలం నర్సంపల్లి గ్రామంలో పూర్తయిన ఇందిరమ్మ ఇంటిని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం పరిశీలించారు. ఇంటి నిర్మాణం పూర్తయిన తీరును పరిశీలించిన కలెక్టర్, లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి అందిన ఆర్థిక సహాయం, నిర్మాణానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.
ఇంటి నిర్మాణ సమయంలో ఎదురైన ఇబ్బందులు, ప్రభుత్వం నుంచి అందిన ప్రోత్సాహం తదితర అంశాలపై లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హిమబిందు, ఎంపీడీవో హెప్సిబా రాణి, స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ రవి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు..

కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 22 (జనంసాక్షి) తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ రెండేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు పలువురు కాంగ్రెస్ నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, నిజామాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు కాటిపల్లి నగేష్ రెడ్డి, మాజీ ఉమ్మడి నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్ భాస్కర్ రెడ్డి తదితరులు మహేష్ కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో కూడా పార్టీ బలోపేతానికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు.

## పెద్ద వాల్గోట్‌లో రూ.3.49 లక్షల సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

### 13 మంది లబ్ధిదారులకు ఆర్థిక సాయం.. ఎమ్మెల్యే భూపతి రెడ్డికి కృతజ్ఞతలు

సిరికొండ సెప్టెంబర్ 22 (జనంసాక్షి ): సిరికొండ మండలంలోని పెద్ద వాల్గోట్ గ్రామంలో 13 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన మొత్తం రూ.3,49,500 విలువైన చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ పిట్ల వనిత నర్సింగ్, ఉపసర్పంచ్ తలకల్ల రాము ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనారోగ్యం, వైద్య చికిత్సల కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న 13 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. లబ్ధిదారుల పేర్లపై మంజూరైన చెక్కులను కార్యక్రమంలో అందించి, ఆపద సమయంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయం వారికి ఉపయోగపడుతుందని నాయకులు తెలిపారు.
సీఎం సహాయ నిధి ద్వారా తమకు ఆర్థిక సాయం అందేలా చొరవ చూపిన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లబ్ధిదారులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో ప్రభుత్వం నుంచి అందిన ఈ సహాయం



తమకు ఎంతో ఉపశమనం కలిగించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కిసాన్ అధ్యక్షుడు గాదరి నర్సారెడ్డి, జాగిరపు నర్సారెడ్డి, ఓబీసీ మండల అధ్యక్షుడు నర్సింగ్, గ్రామ శాఖ అధ్యక్షుడు జాగిరపు సురేందర్ రెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు లియాకత్ అలీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వడియాల శేఖర్ రెడ్డి, నాగెల్లి శ్రీనివాస్ రెడ్డి, సాయి రెడ్డి, సత్యం రెడ్డి, మజీద్ మునీర్, గంటాజి రవి, లింబన్న తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 24 నుండి 26 వరకు

# గణేష్ నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ డైవర్షన్

### పోలీస్ కమిషనర్ వెల్లడి




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 జనంసాక్షి: జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 24 నుండి 26 వరకు గణేష్ నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ డైవర్షన్ చేయడం జరుగుతుందని కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయి చైతన్య తెలియజేశారు. వాహనదారులు ప్రజలు పోలీసు వారికి సహకరించాలని ఆయన కోరారు.

**హైదరాబాదు నుండి నిజామాబాద్ వచ్చే ఆర్టీసీ బస్సులు,ఇతర వాహనాలు**

హైదరాబాదు నుంచి నిజామాబాద్ వచ్చి వెళ్లే వాహనాలు మరియు ఆర్టీసీ బస్సులు ముఖ్యంగా మాధవ నగర్ బైపాస్, కంఠేశ్వర్ బైపాస్, రైల్వే అండర్ పాస్, ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వే స్టేషన్ గుండా ఆర్టీసీ బస్టాండ్ చేరుకోవాలి.

**బోధన్ వెళ్లే మరియు వచ్చే ఆర్టీసీ బస్సులు మరియు ఇతర వాహనాలు**

ముఖ్యంగా బోధన్ వచ్చి వెళ్లే వాహనాలు మరియు ఆర్టీసీ బస్సులు, అర్సపల్లి చౌరస్తాలో ఎడమవైపు తిరిగి, బైపాస్ గుండా ప్రయాణిస్తూ కొత్త కలెక్టరేట్, కంఠేశ్వర్ బైపాస్,రైల్వే అండర్ పాస్, ఎన్టీఆర్ చౌరస్తా నుండి బస్టాండ్ చేరుకోవాలి.తిరిగి ఇదే దారిలో బోధన్ కు వెళ్లాలి.

**ఆర్మూర్ వైపు నుండి నిజామాబాద్ బస్టాండ్ మరియు ఇతర ప్రాంతాలకు వచ్చి వెళ్లే వాహనాలు :**

ముఖ్యంగా ఆర్మూర్ వైపు నుండి నిజామాబాద్ బస్టాండు మరియు ఇతర ప్రాంతాలకు వచ్చి వెళ్లే వాహనాలు కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తా వరకు చేరుకొని అక్కడి నుండి నేరుగా రైల్వే అండర్ పాస్ మరియు ఎన్టీఆర్ "టీ" జంక్షన్ వద్ద కుడి వైపుకు తిరిగి, రైల్వే స్టేషన్ ముందరి నుండి బస్టాండ్ చేరుకోవాలి మరియు ఇదే దారిని ఉపయోగిస్తూ ఆర్మూర్ వైపు తిరిగి వెళ్ళవచ్చు.

**బాన్సువాడ మరియు వర్ని వైపు నుంచి వచ్చి వెళ్లే ఆర్టీసీ బస్సులు మరియు ఇతర వాహనాలు:**

ముఖ్యంగా బాన్సువాడ మరియు వర్ని వైపు నుండి వచ్చి తిరిగి వెళ్లే ఆర్టీసీ బస్సు మరియు ఇతర వాహనాలు నిజామాబాద్ లోని వర్ని చౌరస్తా వరకు చేరుకొని అక్కడి నుండి కుడి వైపుకు తిరిగి ఆర్.ఆర్ చౌరస్తా గుండా పులాంగ్ చౌరస్తా, ఎల్లమ్మ గుట్ట చౌరస్తా, కోర్ట్ చౌరస్తా, ఎన్టీఆర్ చౌరస్తా నుండి రైల్వే స్టేషన్ ముందర నుండి బస్టాండ్ చేరుకోవాలి మరియు ఇదే దారిని ఉపయోగించి తిరిగి వెళ్లాలి.

**భారీ వాహనాలకు ముఖ్యమైన సూచన:**

భారీ వాహనాలు ఎట్టి పరిస్థితిలో 24వ తారీకు ఉదయం 11 గంటల నుండి 26వ తారీకు ఉదయం 11 గంటల వరకు నగరంలో ప్రవేశించరాదు.

**కంఠేశ్వర్ రైల్వే అండర్ పాస్ ఎత్తు**

ముఖ్యంగా రైల్వే అండర్ పాస్ యొక్క ఎత్తు రోడ్డు నుండి 13 ఫీట్లు ఉన్నందున, ఇట్టి విషయాన్ని గమనించి "13 ఫీట్ల లోపల" ఉండే గణపతి విగ్రహాలు మాత్రమే కంఠేశ్వర్ రైల్వే అండర్ పాస్ ఉపయోగించాలి.అదేవిధంగా 13 ఫీట్లు మించిన గణపతి విగ్రహాలు ముఖ్య శోభాయాత్ర రథము వెళ్ళిన తరువాత రైల్వే ఫ్లైఓవర్ను ఉపయోగించుకొని వెళ్లాలి. నిజామాబాద్ పట్టణ ప్రజలు ఇట్టి విషయాన్ని గమనిస్తూ తమరి యొక్క ప్రయాణాలు కొనసాగించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ప్రజలను విజ్ఞప్తి చేశారు.

## "నిబంధనలు పాటిద్దాం ప్రమాదాలను నివారిద్దాం"

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 జనంసాక్షి: రోడ్ అండ్ సేఫ్టీ నిబంధనలు పాటిద్దాం ప్రమాదాలను నివారిద్దాం అని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మణికాంత్ అన్నారు. మంగళవారం టీ.జీ.ఎస్. ఆర్టీసీ నిజామాబాద్ రీజియన్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో రోడ్ & సేఫ్టీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా, కలెక్టర్ కార్యాలయం నుంచి రోడ్ & సేఫ్టీ ఈ దార్ మేనేజర్ వర్షా నిహంత్ లు పాల్గొని డ్రైవర్లు, సిబ్బందికి రహదారి భద్రతపై పలు సూచనలు చేశారు. ముఖ్యంగా వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, వేగం,నియంత్రణ, అప్రమత్తంగా డ్రైవింగ్ చేయడం, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు."సురక్షిత ప్రయాణమే టీజీఎస్ఆర్టీసీ ప్రధాన లక్ష్యం" అని, ప్రతి డ్రైవర్ రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు.డిప్యూటీ రీజినల్ మేనేజర్ పి. జ్యోతి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నిజామాబాద్-1 డిపోమేనేజర్ ఎం.వి రమణ, నిజామాబాద్-2 డిపోమేనేజర్ ఎం. శ్రీనివాస్, సూపర్వైజర్లు,డ్రైవర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రావుట్ల సర్పంచ్ రాజ్ కుమార్ తాత అంతిమయాత్రలో బాజిరెడ్డి జగన్

### పాడె మోసి అంత్యక్రియల్లో పాల్గొన్న నిజామాబాద్ రూరల్ ఇన్‌చార్జి



సిరికొండ, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): రావుట్ల గ్రామ సర్పంచ్ రాజ్‌కుమార్ తాత నిన్న సాయంత్రం మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న నిజామాబాద్ రూరల్ ఇన్‌చార్జి బాజిరెడ్డి జగన్ మంగళవారం రావుట్లకు చేరుకుని అంతిమయాత్రలో పాల్గొన్నారు. మృతదేహానికి నివాళు లర్పించి, పాడె మోస్తూ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అనంతరం సర్పంచ్ రాజ్‌కుమార్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. అంతిమయాత్రలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా కాంగ్రెస్ సర్కార్

**◆ విద్యార్థుల భవిష్యత్ కు అండగా రేవంతన్న ప్రభుత్వం ◆ నాణ్యమైన విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ తెలంగాణ అల్పాహార కార్యక్రమం ◆ ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు హామీ ◆70 కోట్లతో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి ◆ రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు**

**సుల్తానాబాద్,సెప్టెంబర్ 22(జనంసాక్షి) :** మండలం లోని గర్రెపల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో హరే రామ కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అల్పాహార కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ,గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు ఉదయాన్నే వ్యవసాయ, ఇతర పనులకు వెళ్లిపోతుండటంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం అందించే విషయంలో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు అల్పాహారాన్ని అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. వారానికి ఆరు రోజుల పాటు ఇడ్లీ- సాంబార్, పూరీ- ఆలూ కుర్మా, దోస, ఉప్మా, మిల్లెట్ ఇడ్లీ- సాంబార్, బోండా తదితర అల్పాహారం తోపాటు పాలు అందిస్తున్నట్లు వివరించారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఇప్పటివరకు రూ.70 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రభుత్వ విప్ విజయరమణ రావు తెలిపారు. కాంపౌండ్ వాల్స్, నూతన పాఠశాల భవనాలు, మరుగుదొడ్లు, భవనాల ఆధునీకరణతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడటంతో ప్రైవేట్ పాఠశాలల నుంచి కూడా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారని పేర్కొన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, ఇప్పటికే పిల్లర్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. ఏడాది కాలంలో పనులు పూర్తి చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థు ల హాస్టళ్లను ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేసి, అందరికీ సమాన విద్య అందించే లా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, విద్యార్థులకు అన్ని విధాలా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.




రానున్న కాలంలో ఓదెలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి పెద్దపల్లి నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. గర్రెపల్లి పాఠశాలలో విద్యార్థులు, గ్రామస్తుల కోరిక మేరకు ఓపెన్ జిమ్,వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు అలాగే గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీరగోని రమేష్ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు,సింగిల్ విండో చైర్మన్లు కల్లేపల్లి జానీ,శ్రీగిరి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ,సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు నామని రాజిరెడ్డి, సర్పంచుల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి కోదాటి సాయికిరణ్, తో పాటు గ్రామాల సర్పంచ్లు, ఉపసర్పంచ్లు,గ్రామపంచాయతీ పాలకవర్గం ప్రజాప్రతినిధులు,ఉపాధ్యాయులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ,గ్రామస్తులు,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అండగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం- అల్పాహారం పంపిణీ



**సుల్తానాబాద్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని వార్డు కౌన్సిలర్లు ఉట్ల వర ప్రదీప్ చింతల రాజు మూడవ వార్డు కౌన్సిలర్ కందునూరి సమతా కుమార్,మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత,అన్నారు. మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార కార్యక్రమాన్ని ఏడవ వార్డుతో పాటు 8వ వార్డు, మూడవ వార్డు, పదవ వార్డు ప్రభుత్వ పాఠశాలల్లో హరే రామ హరే కృష్ణ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అల్పాహార కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం రేవంత్ రెడ్డి గ్రామీణ ప్రాంత విద్యార్థిని విద్యార్థులను తీర్చిదిద్దేందుకు యూనిఫామ్ మొదలుకొని నోట్ బుక్స్ అల్పాహారం మధ్యాహ్న భోజనం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని స్పష్టం చేశారు.

## కొత్త పట్టాదారులకు సెప్టెంబర్ 30 వరకు గడువు

సుల్తానాబాద్,సెప్టెంబర్ 22(జనంసాక్షి) : మండలంలోని అల్లిపూర్ గ్రామంలో రైతు గుర్తింపు కార్డు నమోదు కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ ఏడాది జనవరి 1 నుండి ఆగస్టు 13 మధ్య కొత్తగా పట్టాదారు పాస్‌బుక్‌లు పొందిన రైతులు ఈ నెల 30వ తేదీ లోపు తప్పనిసరిగా 'ఫార్మర్ ఐడీ' (రైతు గుర్తింపు కార్డు) నమోదు చేసుకోవాలని ఏఈవో వై. రవితేజ కోరారు.గతంలోనే గుర్తింపు కార్డు పొందిన రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.రాబోయే రోజుల్లో ప్రభుత్వ పంట కొనుగోళ్లు, పీఎం కిసాన్ నిధుల జమ,రాయితీపై ఎరువులు పొందడానికి ఈ డిజిటల్ కార్డు నంబర్ అత్యంత కీలకమని తెలిపారు.అర్హులైన రైతులు తమ కొత్త పాస్‌బుక్, ఆధార్ కార్డు,మొబైల్ నంబర్‌తో ఏఈవోను లేదా సమీప మీ-సేవ కేంద్రాన్ని సంప్రదించి,నిర్దేశిత గడువు ముగిసేలోగా నమోదు పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు.




## షీ టీం అవగాహన సదస్సు



**సుల్తానాబాద్,సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** రామగుండం సి.పి ఆదేశాల మేరకు, షీ టీమ్ ఇంచార్జ్ ఎస్సై లావణ్య ఆధ్వర్యంలో, సుల్తానాబాద్ మండలం,గర్రెపల్లి లోని ఎంపీపీ ఎస్ స్కూల్, విద్యార్థులకు షీ టీమ్ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా, షీ టీమ్ మెంబర్ స్నేహలత మాట్లాడుతూ, గుడ్ టచ్ బాడ్ టచ్, గురించి విద్యార్థులు తెలియని వారి పట్ల ఎలా ఉండాలి,ఫోక్సో యాక్ట్ గురించి,సోషల్ మీడియా ప్రభావం పిల్లలపై ఎలా ఉంది,విద్యార్థుల ప్రవర్తన నియామవాలి గురించి తెలిపారు మహిళల భద్రత ఆన్లైన్ మోసాలపై యాంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిఘా ఉంటుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు.మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100/112 నంబర్ కు డయల్ చేయాలని,ఆన్లైన్ మోసాలకు గురైతే 1930 కి ఫోన్ చేయాలనీ,మహిళలకు ప్రయాణ సమయం లో ట్రావెలింగ్ సేఫ్టీ అప్ టీ సేఫ్ యాప్ వాడాలని తెలిపారు.ఈ కార్యక్రమం లొ హెడ్ మాస్టర్ అశోక్,ఉపాధ్యాయులు షీ టీమ్ సభ్యులు, మౌనిక పాల్గొన్నారు.

## నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన ప్రభుత్వ విప్

**- ప్రశాంతంగ గణేష్ నిమజ్జనం చేసుకోవాలి**

**- ప్రభుత్వ విప్ విజయ రమణారావు**



**సుల్తానాబాద్,సెప్టెంబర్ 22(జనంసాక్షి) :** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణారావు సూచించారు.మంగళవారం సుల్తానాబాద్ పెద్ద చెరువును సందర్శించి గణేష్ నిమజ్జన ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ కమిషనర్ టీ రమేష్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ గణేష్ నిమజ్జనాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో శాంతియుత వాతావరణంలో పండుగలాగా నిర్వహించుకోవాలని సూచించారు. నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ బిరుదు రాధాకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ ప్రకాష్ రావు,మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత, మున్సిపల్ కమిషనర్ రమేష్ కౌన్సిలర్లు ఉట్ల వర ప్రదీప్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేగోళం అబ్బయ్య గౌడ్ కౌన్సిలర్ గాజుల రాజమల్లు, తొ ర్రి కొండ ప్రభాకర్,సిద్ద తిరుపతి, చింతల రాజు,గాదాసు మంజుల రవీందర్, ఇర్ల శేఖర్, కందునూరి కుమార్‌తోపాటు కాంగ్రెస్ పార్టీ నేతలు న్యాతరి దేవేందర్,ఆరెపల్లి కిరణ్,తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం నాణ్యతా ప్రమాణాలపై రైతులకు అవగాహన

కోనరావుపేట(జనంసాక్షి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ పథకంలో భాగంగా గ్రామ సర్పంచ్ కమ్మరి స్వప్న అధ్యక్షతన, నిమ్మపల్లి రైతు వేదికలో రైతులకు వరి సన్న రకాలలో సమగ్ర యాజమాన్య పద్ధతులు, పంట మార్పిడి, వరి ధాన్యం కొనుగోలులో పాటించ వలసిన నాణ్యత ప్రమాణాలు వంటి అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, కోనరావుపేట పీఏసీఎస్ చైర్మన్ చేపూరి గంగాధర్ భూక్యారెడ్డి తండా సర్పంచ్ నరేష్ నాయక్ మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ సాయికుమార్ వ్యవసాయ విస్తరణ అధికారి అనుముల సహజ తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు వ్రాసి తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తులపై కేసు నమోదు

## ఎల్లారెడ్డిపేట సిఐ ఓ. వెంకటేష్



**ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 22, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేటలో రెండు రోజుల క్రితం రాత్రి షట్టర్ పైకి రాయి విసిరారంటూ, రాళ్లు కుప్పలు ఉన్నాయని చెప్పి తప్పుడు వార్తలు రాసి వాటిని సోషల్ మీడియాలో వైరల్ చేయడమే కాకుండా షేర్ చేసిన ఈ ప్రాంతంలో వేర్వేరు వర్గాల మధ్య గొడవలు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని సిఐ ఓ. వెంకటేష్ తెలిపారు. ఈ విషయంలో తక్షణమే ఎల్లారెడ్డిపేట పోలీసులు స్పందించి సాంకేతిక పరిజ్ఞానంతో విచారణ చేసి ఒకే వర్గానికి చెందిన మిత్రుడు తమాసా కోసం చేసినటువంటి చిన్న సంఘటనని పెద్దదిగా కల్పించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎల్లారెడ్డిపేట ప్రజలందరికి తెలియజేశారు. ఏదైన విషయం తెలిసినచో అది నిజమా, అబద్ధమా అని నిర్ధారించుకోకుండా సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచురించినచో వారిపై చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఏదైన మీ దృష్టికి వచ్చినచో తక్షణమే పోలీసువారికి సమాచారం అందించాలని, సిసి ఫుటేజ్ నిర్వహకులు సిసి ఫుటేజ్‌నీ బయటవారికి ఎవరికి ఇవ్వవద్దని, ఇట్టి సమాచారాన్ని పోలీసులకు తెలియకుండా అనధికారికంగా ప్రచురించారాదన్నారు. ప్రతి ఒక్కరు ఎలాంటి ఉద్వేగాలకు లోన్ కాకుండా సమయం మనం పాటిస్తూ శాంతి భద్రతల సంరక్షణకు పోలీసు శాఖకు సహకరించాలని ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఓ. వెంకటేష్ తెలిపారు.

# గణేష్ నిమజ్జనోత్సవానికి భద్రతా ఏర్పాట్లు పూర్తి

**200 మంది పోలీసు అధికారులు,సిబ్బందితో పటిష్ట భద్రత.. జిల్లా ఎస్పీ మహేష్.బి గితే**

**శోభాయాత్రలో డిజే లకు అనుమతి లేదు,నిబంధనలకు విరుద్ధంగా డిజే నిర్వహిస్తే చర్యలు తప్పవు**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 22 (జనంసాక్షి)**
వేములవాడలో సుమారు 320 గణేష్ మండపాల్లో గణనాథులు కొలువుదీరగా, బుధవారం నిర్వహించనున్న గణేష్ నిమజ్జనం, శోభాయాత్రను జీరో యాక్సిడెంట్ – జీరో ఇన్సిడెంట్ లక్ష్యంతో ప్రశాంతంగా,సురక్షితంగా నిర్వహించేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. మంగళవారము నిమజ్జనం ప్రాంతాన్ని ఆయన పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ నిమజ్జనం సందర్భంగా 200 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, రూట్ డైవర్షన్లు తదితర భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పికెట్లు,పుషింగ్ పార్టీలను ఏర్పాటు చేసి, నిరంతరం పర్య వేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. మండపాల నిర్వాహకులు నిర్దేశించిన సమయానికి శాంతియుత వాతావరణంలో నిమార్జనం పూర్తి అయ్యేలా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచనలకు అను గుణంగా ప్రణాళిక చేసుకోవాలని,ఏలాంటి గొడవలు, అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా శాంతియుత వాతావరణంలో శోభయాత్ర సాగేలా సహకరించాలని ఆయన కోరారు.



**గణేష్ నిమజ్జన శోభాయాత్రలో నిబంధనలు తప్పక పాటించాలి...**
నిమజ్జనం సందర్భంగా ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలకు అనుమతి లేదని,నిబంధనలకు విరుద్ధంగా డీజేలు వినియోగిస్తే చర్యలు తప్ప వన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు నిర్దేశించిన సమయానికి ఆలస్యం చేయకుండా నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, శోభాయాత్ర సమయంలో ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా పాటలు వినిపించడం,బాణాసంచా కాల్చి ప్రజలకు ఇబ్బందులు కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. శోభాయాత్రలో క్రమపద్ధతిలో క్యూ పాటిస్తూ, వాహనాలు మంచి కండిషన్‌లో ఉండేలా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని,మద్యం సేవించి శోభాయాత్రలో పాల్గొని ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటమన్నారు. శోభాయాత్రలో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడిన పోలీస్ వారికి సమాచారం అందించాలని,శోభాయాత్ర సందర్భంగా పాల్గొనే భక్తులకు,ముఖ్యంగా మహిళలు మరియు చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, డిఎస్పి శ్రీనివాసులు, పట్టణ సిఐ వీరప్రసాద్,మున్సిపల్ కమిషనర్ లోకేష్,పోలిస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బీజేపీ పోరాటం వల్లే చింతకుంట కెనాల్‌కు నీటి విడుదల

## కాంగ్రెస్ తీరుపై బీజేపీ విమర్శలు



**కరీంనగర్, క్రైమ్ సెప్టెంబర్ 22( జనంసాక్షి)**
కరీంనగర్‌లోని చింతకుంట కెనాల్ వద్ద వినాయక చవితి నిమజ్జన కార్యక్రమం కోసం ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, బీజేపీ శ్రేణులు మరియు హిందూ సంఘాలు చేపట్టిన ధర్నా పోరాటం వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చి నీటిని విడుదల చేసిందని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయ కార్యదర్శి గుంజేటి శివకుమార్ స్పష్టం చేశారు. కొత్తపల్లి మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కరీంనగర్‌లో ఏళ్లుగా జరుగుతున్న వినాయక నిమజ్జన ప్రాంతమైన చింతకుంటను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, పోలీస్ కమిషనర్లతో కలిసి సందర్శించి, నీటిని విడుదల చేయాలని అధికారులను కోరారని గుర్తుచేశారు. నిమజ్జనానికి కేవలం రెండు రోజులు మాత్రమే గడువు ఉన్నప్పటికీ అధికారులు నీరు విడుదల చేయకపోవడాన్ని తప్పుపడుతూ, హిందూ సంఘాలు మరియు బీజేపీ కార్యకర్తలు సోమవారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారన్నారు. ఈ ప్రజా పోరాట ఫలితంగానే ప్రభుత్వం స్పందించి నీటిని విడుదల చేయాల్సి వచ్చిందని తెలిపారు. బీజేపీ సాధించిన ఈ విజయానికి వస్తున్న మైలేజీని ఓర్వలేకనే స్థానిక కార్పొరేటర్ గడ్డి ప్రదీప్ కాంగ్రెస్ నాయకులు వచ్చి మా వల్లనే జరిగిందని గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు.
గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు హిందువుల పండుగలను చిన్నచూపు చూశాయని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. బీజేపీ కార్పొరేషన్ మేయర్ బాధ్యతలు చేపట్టాక రెట్టింపు నిధులతో, మరింత ఉత్సాహంతో ఉత్సవ ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. ఎల్లప్పుడూ హిందువులకు అండగా నిలిచేది బీజేపీ మాత్రమేనని స్పష్టం చేశారు.
ఈ విలేకరుల సమావేశంలో కొత్తపల్లి జోన్ అధ్యక్షులు ముత్తునూరు హరీష్, కొత్తపల్లి మండల అధ్యక్షులు కుంట తిరుపతి, ఎస్టీ మోర్చా అధ్యక్షులు శ్రీనివాస నాయక్, ఓబీసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాచకొండ కొమురయ్య, జిల్లా నాయకులు జిట్టవేణీ రేణు, శ్రీనివాస్ నాయక్, బుస అనిల్ కుమార్, దాసరి రవి తదితరులు పాల్గొన్నారు.



# కల్వచర్ల గ్రామ అభివృద్ధికి సహకరించాలి

**రామగిరి జనం సాక్షి సెప్టెంబర్ 22:**
రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి సంబంధించిన పలు సమస్యలు, అభివృద్ధి అవసరాలపై కల్వచర్ల సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి, వార్డు సభ్యులతో కలిసి ఆర్జీ?3 జీఎం సుంకర మధుసూదన్ గారిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను జీఎం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, గ్రామాభివృద్ధికి అవసరమైన పనులకు సహకారం అందించాలని కోరారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతుల అభివృద్ధి, ఇతర ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.గ్రామ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి సంబంధిత అధికారుల సహకారంతో ముందుకు సాగుతామని సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు మల్యాల పద్మ,కొయ్యడ పద్మ,బండ సంపత్,కొట్టే నాగరాజు ,రోడ్డ విజయ్,చిందం కవిత,రేండ్ల కుమారస్వామి పాల్గొన్నారు.

## హెచ్‌సీఏ అండర్-19 కరీంనగర్ జిల్లా జట్టుకు ఎంపికైన అజయ్ చంద్ర

**కమాన్‌పూర్, సెప్టెంబర్ 22, (జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌కు చెందిన యువ క్రికెటర్ నల్లగొండ అజయ్ చంద్ర హెచ్‌సీఏ అండర్?19 సీ డివిజన్ లీగ్ కోసం కరీంనగర్ జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. ఇటీవల అండర్?16 స్థాయిలో కనబరిచిన ప్రతిభను పరిగణనలోకి తీసుకుని అండర్?19లో అవకాశం దక్కింది. కుడిచేతి ఫాస్ట్ బౌలర్‌గా, మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్‌గా అజయ్ చంద్ర ప్రతిభ కనబరుస్తున్నాడు. అండర్?16 పోటీల్లో బౌలింగ్‌తో ఆకట్టుకున్న అతడు, ప్రస్తుతం అండర్?19 స్థాయిలో తన సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాడు. గ్రామీణ ప్రాంతం నుంచి హెచ్‌సీఏ అండర్?19 జిల్లా జట్టుకు ఎంపిక కావడం కమాన్‌పూర్ ప్రాంత క్రీడాభిమానుల్లో ఆనందం నింపింది. అజయ్ ఎంపిక పట్ల కుటుంబ సభ్యులు, కోచ్‌లు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. భవిష్యత్ పోటీల్లోనూ ప్రతిభను కొనసాగిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



## అలుగునూర్లో గణనాధులను దర్శించుకున్న నగర మేయర్

**ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న మేయర్**

**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :**
కరీంనగర్ పట్టణం 8వ డివిజన్ అలుగునూరు లో కొలువుదీరిన గణనాధులను మంగళవారం రాత్రి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ దర్శించుకున్నారు. అల్గునూరులోని కౌండిన్య యూత్, విశ్వామిత్ర యూత్, మహాలక్ష్మికి గణపతి యూత్, లిటిల్ స్టార్స్ యూత్, మున్నూరుకాపు సంఘం, శ్రీ వెంకటేశ్వర కాలనీ శ్రీ పంచముఖ హనుమాన్ యూత్ ల ఆధ్వర్యంలో అల్గునూరులోనీ వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన వినాయకులను మేయర్ కోలగాని శ్రీనివాస్ దర్శించి, వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వినాయకుడిని మేయర్ ప్రార్థించారు. ఈ పవిత్ర వేడుకలో భాగంగా ఆయా ప్రాంతాల నిర్వాహకులు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్‌ను సాదరంగా ఆహ్వానించి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అలుగునూరులోని ఆయా ప్రాంతాల నిర్వాహకులతో పాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధిబొంతల కళ్యాణ్ చంద్ర, బీజేవైఎం మాజీ జిల్లా అధ్యక్షులు దుర్శెట్టి సంపత్, తిమ్మాపూర్ మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వర చారి, బీజేవైఎం మండల అధ్యక్షులు గడ్డం అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



# స్వచ్ఛతపై అవగాహన.. వ్యర్థాల వేర్పాటుపై సూచనలు

**కమాన్‌పూర్, సెప్టెంబర్ 22, (జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సర్పంచ్ రంగు సత్య నారాయణగౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి డీఆర్‌డీఏ అధికారి ఎం. కలిందిని, జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ కోఆర్డినేటర్ రాఘవులు హాజరై పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. సెప్టెంబర్ 17న ప్రారంభమైన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం అక్టోబర్ 2న నిర్వహించే గ్రామసభలతో ముగియనుందని తెలిపారు. ఇంటి వద్దనే వ్యర్థాలను వేరు చేసి ఇవ్వడం ద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టవచ్చని వివరించారు. తడి వ్యర్థాలను ఆకుపచ్చ రంగు డబ్బాలో, పొడి వ్యర్థాలను నీలిరంగు డబ్బాలో వేయాలని సూచించారు. వంటగది వ్యర్థాలు, పండ్ల తొక్కలు, ఆహార అవశేషాలు, పూలు తదితరాలను తడి వ్యర్థాలుగా పేర్కొన్నారు. ప్లాస్టిక్, కాగితం, గాజు, లోహం, కలప, రబ్బరు తదితరాలను పొడి వ్యర్థాలుగా వేరు చేయాలన్నారు. ఉపయోగించిన డైపర్లు, శానిటరీ న్యాప్కిన్లు, టాంపూన్లు, కండోమ్స్ వంటి శానిటరీ వ్యర్థాలను ఎరుపు రంగు డబ్బాలో వేయాలని సూచించారు. పెయింట్, పురుగుమందుల డబ్బాలు, బల్బులు, బ్యాటరీలు, పాదరస థర్మామీటర్లు, వాడిన సూదులు, మందులు వంటి ప్రత్యేక జాగ్రత్త అవసరమైన వ్యర్థాలను నల్ల రంగు డబ్బాలో వేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను బాధ్యతగా తీసుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రియాంక, ఎంపీఓ సౌమ్య, ఏపీఎం పద్మ, ఉపసర్పంచ్ రఫిక్ సోహెల్, పంచాయతీ కార్యదర్శి రాము, వార్డు సభ్యులు మెరుగు కుమార్, సీసీ బిక్షపతి, సీఏలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.






# పెద్దులు నోరు అదుపులో పెట్టుకో..

## సహకార సంఘంలో అవినీతికి చోటు లేదు

### ఎడపల్లి సహకార సంఘం చైర్మన్ పోల మల్కారెడ్డి

**ఎడపల్లి, సెప్టెంబర్ 22 ( జనంసాక్షి ) :**
ఎడపల్లి సహకార సంఘంలో ఎలాంటి అవినీతి జరగలేదని అయితే పెద్దులు అనే వ్యక్తి తన ఇష్టారాజ్యంగా స్థాయిని మించి ఎడపల్లి సహకార సంఘంలో కోట్ల రూపాయల అవినీతి జరిగింది అనడంలో ఎలాంటి నిజం లేదని ఎడపల్లి సహకార సంఘం చైర్మన్ పోల మల్కారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తాను చైర్మన్ పదవి చేపట్టినప్పుడు నుండి ఇప్పటివరకు సహకార సంఘం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయడం జరిగిందన్నారు. కోటి రూపాయల పైచిలుకు నష్టాలలో ఉన్న ఎడపల్లి సహకార సంఘం ప్రస్తుతం 40 లక్షల వరకు నష్టాల్లో ఉందని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా ఎరువుల కొనుగోలు విషయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల విషయంలో తనతో పాటు సహకార సంఘం కార్యదర్శి పాలకవర్గం సమిష్టి కృషితో నేడు సహకార సంఘంకు లాభాలు వచ్చాయన్నారు. ఎల్టి రుణాలకు వడ్డీలు చెల్లించడంతో పాటు దీర్ఘకాలిక అప్పుల విషయంలో ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. ప్రస్తుతం బ్యాంకులో 58 లక్షల వరకు డిపాజిట్ చేయడం జరిగిందనే విషయాన్ని పెద్దులు గ్రహించాలన్నారు. అలాగే అవుట్ సర్సింగ్ ఉద్యోగులకు కరెంట్ అకౌంట్ నుండి వారికి వేతనాలను అందించడం జరుగుతుందన్నారు. తనకు తాను ఏదో ఊహించుకొని కల్పితాలతో సహకార సంఘంపై బురద చల్లే ప్రయత్నాలు మానుకోవాలని చైర్మన్ హితవు పలికారు. పాలకవర్గం అధికారుల సమిష్టి కృషితోనే నేడు ఎడపల్లి సహకార సంఘం నష్టాల బాట నుండి కొద్దికొద్దిగా లాభాల బాట వైపు పయనిస్తుందని విషయాన్ని పెద్దులు గ్రహించి మరోసారి ఇలాంటి ఆరోపణలు చేస్తే సహించేది లేదని అవసరమైతే న్యాయపరంగా ఆయనపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడే ప్రసక్తే లేదని పోల మల్కారెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం కార్యదర్శి రాజారాం, సహకార సంఘం డైరెక్టర్ చేపూర్ నగేష్ గౌడ్, గ్రామ పెద్దలు బంజ కామప్ప, దూస గంగాధర్, పడిదం కృష్ణారెడ్డి, గెంటే మల్కన్న, ఫర్టిలైజర్ హైమద్, తూట్కూరు రవీందర్ రెడ్డి,

# విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

## బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి);**
సిరిసిల్ల ఆర్టీసీ డిపో మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన భరత్ కుమార్ ను మంగళవారం బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు ఎదుర్కొంటున్న బస్సుల సమస్యలను డీ,ఎం దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన రూట్లలో బస్సులను అందుబాటులో ఉంచాలని, విద్యార్థుల ప్రయాణ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.
విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని బస్సుల సమస్యను పరిష్కరించాలని కంచర్ల రవి గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు మట్టే శ్రీనివాస్, ఆరెల్లి వినయ్ కుమార్, చెట్టిపెల్లి హరీశ్, ఎం.డి. అజ్జు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.





# గణేష్ ఉత్సవాలకు ఎస్ఎస్ అన్వర్ సహకారం..

## 23 మండపాలకు 25 కిలోల బియ్యం చొప్పున అందజేత

**కమాన్‌పూర్, సెప్టెంబర్ 22, (జనంసాక్షి) :**
గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.ఎస్. అన్వర్ గ్రామపంచాయతీ పరిధిలోని 23 వినాయక మండపాలకు బియ్యం అందజేశారు. ఒక్కో మండపానికి 25 కిలోల చొప్పున మొత్తం 575 కిలోల బియ్యాన్ని నిర్వాహకులకు అందించారు. ఈ సందర్భంగా ఆయా వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. కమాన్‌పూర్ గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని విఘ్నేశ్వర స్వామివారిని ప్రార్థించినట్లు అన్వర్ తెలిపారు. గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు పుష్కలంగా పండాలని, రైతులు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. అలాగే ప్రజాపాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగేందుకు ఎలాంటి అవరోధాలు ఎదురుకాకుండా అన్ని విఘ్నాలు తొలగించాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఐక్యతా భావంతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని మండపాల నిర్వాహకులకు సూచించారు.

# జోనల్ స్థాయి క్రీడల్లో ప్రగతి పాఠశాల విద్యార్థుల ప్రతిభ

## జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించిన కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి

**రామగిరి జనన సాక్షి (సెప్టెంబర్ 22):**
నేషనల్ స్కూల్ గేమ్స్ 2026-27లో భాగంగా నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో స్థానిక ప్రగతి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్?14 విభాగంలో ఓ. అనీష్ కబడ్డీ, రన్నింగ్ విభాగాల్లో, పి. దీక్షిత్ కబడ్డీ విభాగంలో, సిహెచ్. రాజకుమార్, ఎస్. మను శ్రీ కోకో విభాగంలో ప్రతిభ చూపారు. అదేవిధంగా అండర్?17 విభాగంలో ఫణి తేజ షాట్‌పుట్‌లో, బి. కౌశిక్ కబడ్డీ విభాగంలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రగతి పాఠశాల కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి అభినందించి మేమెంటోలను అందజేశారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరచడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమ శిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, జట్టుగా పనిచేసే స్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీల్లోనూ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ కొప్పుల గోవర్ధన్ రావు,ఖఖ భాగ్యలక్ష్మి, పాఠశాల అధ్యాపక బృందం మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.




# చొప్పదండిలో కురిసిన భారీ వర్షం

**చొప్పదండి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):**
చొప్పదండిలో మంగళవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో అరగంటకు పైగా భారీ వర్షం కురిసింది. దాదాపు అరగంటకు పైగా నుంచి భారీ వర్షం కురవడంతో మురికి కాలువలు నిండి భారీ వరద ప్రవాహం రోడ్లపై చేరింది. కుడి చెరువు సమీపంలో 30 సంవత్సరాల క్రితం నిర్మించిన పాత డ్రైనేజీలు చిన్నగా ఉన్నాయి. అవి కూడా శిథిలవస్థకు చేరాయి. డ్రైనేజి సరిగా లేక చిన్నపాటి వర్షం వచ్చిన కూడా వరద నీరు రోడ్లపై చేరి లోతట్టులో ఉన్న ఇండ్లలో కి వరద చేరుతుంది. వర్షకాలం ప్రారంభంలోనే డ్రైనేజీలు సరి చేసి వరద నీళ్లు రాకుండా చూడాలని పాలకులకు విన్నవించినా ఇప్పటికి పరిష్కారం కాలేదు. మంగళవారం అకస్మాత్తుగా వచ్చిన భారీ వర్షానికి వరద ప్రవాహం నీళ్లు మురుగు కాలువలోకి వెళ్లే పరిస్థితి లేక రోడ్లపై నుంచి ఇండ్లలోకి చేరడంతో వస్తువులు తడిచి అందు పేరుకుపోయింది. ఇండ్లలో కి చేరిన నీటిని ఎత్తి పోసుకోవాల్సి వస్తుందని, వరద కారణంగా తీవ్ర ఇబ్బందులు పడాలి వస్తుందని బాధితులు పేర్కొన్నారు. ఇండ్లలోకి నీళ్లు రాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని మున్సిపాలిటీ పాలకులకు అధికారులకు పేర్కొన్న పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇకనైనా మున్సిపల్ పాలకులు, అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని బాధిత కుటుంబాల వారు కోరుతున్నారు. ఇంటిలోకి వరద నీరు చేరాయని బాధితులు కుడి చెరువు సమీపంలోని కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వగా వారు మునిసిపల్ సిబ్బందితో వరద నీరు పోయేలాగా తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. త్వరలోనే కొత్త డ్రైనేజీలు నిర్మించి శాశ్వత పరిష్కారం



చేపడతామని హామీ ఇచ్చారు. మంగళవారం కురిసిన భారీ వర్షానికి పడిన పిడుగులకు మండలంలోని రాగంపేట గ్రామానికి చెందిన కోమల్ల కనుకయ్య కి చెందిన ఆవు పిడుగు పాటు తో మరణించడం జరిగింది.

# సిరిసిల్లలో సీఎం రేవంత్ సభను విజయవంతం చేయాలి

## సెప్టెంబర్ 30న లక్ష మందితో భారీ బహిరంగ సభ : విప్ ఆది శ్రీనివాస్

**సిరిసిల్ల టౌన్ సెప్టెంబర్ 22 (జనంసాక్షి)**
కేటీఆర్ నీ పతనం ఈ నెల 30 నుండి మొదలు కాబోతుందిని,రేవంత్ రెడ్డి సభ సిరిసిల్ల లో ఉందంటే కేటీఆర్ వెన్నులో వణుకు పుడుతుందని, సెప్టెంబర్ 30న సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే భారీ బహిరంగ సభను లక్ష మందితో నిర్వహిస్తున్నామని ప్రజలు విజయవంతం
చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు మంగళవారం సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూసిరిసిల్లలో రేవంత్ రెడ్డి సభ ప్రకటనతో బీఆర్ఎస్‌లో ఆందోళన మొదలైందని విప్ అన్నారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్ల చేనేత రంగానికి, వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి, సాగునీటి ప్రాజెక్టులకు, జిల్లా అభివృద్ధికి చేసిన కృషిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.సీఎం రేవంత్‌రెడ్డి సభతో సిరిసిల్లలో రాజకీయంగా కొత్త చర్చ ప్రారంభమవుతుందని, కేటీఆర్ రాజకీయ పతనం సెప్టెంబర్ 30 నుంచి మొదలవుతుందని ఆయన వ్యాఖ్యానించారు.రాష్ట్రంలో ఫామ్‌హౌస్ సంస్కృతిని బీఆర్ఎస్ తీసుకొచ్చిందని ఆరోపించిన ఆది శ్రీనివాస్.ఎర్రవెల్లి, రంగనాయకసాగర్, జన్వాడ తదితర ప్రాంతాల్లోని ఫామ్‌హౌస్‌ల అంశాన్ని ప్రస్తావించారు. 22ఏ భూముల అంశంలో పేదలకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 22ఏ జాబితాలో ఉన్న పేదల ఇళ్లకు పట్టాలు ఇచ్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సిరిసిల్లలో భూముల వ్యవహారంపై తమ వద్ద ఉన్న అంశాలను ప్రజల ముందుకు తీసుకువస్తామని చెప్పారు.సభకు జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలను తరలించేలా గ్రామ, మండల స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఏ గ్రామానికి ఎన్ని బస్సులు అవసరమో ముందుగానే తెలియజేస్తే జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బస్సులను ఏర్పాటు చేసే చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలాల వారీగా ప్రజలను సమీకరించడంతో పాటు వివిధ సామాజిక, రాజకీయ వర్గాల ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల నాయకుల సమన్వయంతో సభను విజయవంతం చేయాలని కోరారు.చేనేత రంగానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.300 కోట్లకు పైగా బకాయిలు మిగిలాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ బకాయిలను చెల్లించడంతో పాటు చేనేత కార్మికులకు పని కల్పించే చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. గత ఏడాది సుమారు 6.66 కోట్ల మీటర్ల చీరల ఆర్డర్లు ఇవ్వడంతో పాటు పాఠశాల యూనిఫామ్‌లు తదితర ఆర్డర్ల ద్వారా పవర్‌లూమ్, చేనేత కార్మికులకు ఉపాధి కల్పించామని తెలిపారు. ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటివరకు సుమారు 4.60 కోట్ల మీటర్ల చీరల ఉత్పత్తికి ఆర్డర్లు ఇచ్చినట్లు వివరించారు.
చేనేత కార్మికులకు సుమారు రూ.49 కోట్ల రుణమాఫీ చేసినట్లు, రూ.50 కోట్లతో యార్న్ డిపోను ఏర్పాటు చేసి, ఇప్పటివరకు సుమారు రూ.69 కోట్ల విలువైన యార్న్‌ను 90 శాతం సబ్సిడీపై అందించినట్లు విప్ పేర్కొన్నారు.
గత ప్రభుత్వ హయాంలో ఆలయ అభివృద్ధికి హామీలు ఇచ్చినా ఆశించిన స్థాయిలో నిధులు విడుదల కాలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆలయ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.
వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి ఇప్పటివరకు సుమారు రూ.250 కోట్ల మేర నిధులు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు.అలాగే రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రస్తుతం సుమారు రూ.1,000 కోట్ల మేర అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా జిల్లాకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రకటించే అవకాశం ఉందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసినట్లు నాయకులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 22.25 లక్షల కుటుంబాలకు సుమారు రూ.20,650 కోట్ల రుణమాఫీ చేసినట్లు తెలిపారు.2018?19 కాలంలో ధరణి వ్యవస్థను ఉపయోగించుకుని పెద్ద ఎత్తున



భూములు బదలాయింపు జరిగాయని ఆరోపిస్తూ, అర్హులైన పేదలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.22-ఏ పరిధిలో నష్టపోయిన పేదల భూములకు పరిష్కారం చూపడంతో పాటు, ఆ భూముల్లో పేదలు నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈ అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో వెల్లడించిన విషయాలను ప్రజలకు వివరించాలని సూచించారు.బీఆర్ఎస్ పాలనలో ఫామ్‌హౌస్‌ల సంస్కృతి పెరిగిందంటూ విప్ తీవ్ర విమర్శలు చేశారు. ఎర్రవల్లి, రంగనాయకసాగర్, జన్వాడ, అజీజ్‌నగర్, మొయినాబాద్ తదితర ప్రాంతాల్లో కొందరు బీఆర్ఎస్ నేతలకు సంబంధించిన ఫామ్‌హౌస్‌ల చుట్టూ ప్రభుత్వ, అసైన్డ్, శిఖం తదితర భూముల అంశాలు ఉన్నాయని ఆరోపించారు.ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తులు ఇప్పటికే వెల్లడించిన వివరణలు, అధికారిక రికార్డుల ఆధారంగా వాస్తవాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, భూముల వ్యవహారాలపై ప్రభుత్వం పరిశీలనలను చేస్తుందన్నారు..జిల్లా ఏర్పాటు కోసం ప్రజలు, ఉద్యమకారులు చేసిన పోరాటం ఫలితంగానే జిల్లా ఏర్పడిందన్నారు.సెప్టెంబర్ 30 సభ విజయవంతానికి గ్రామస్థాయి నుంచే కార్యాచరణ ప్రారంభించాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. ప్రతి గ్రామానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, బస్సుల ద్వారా ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు.
సెప్టెంబర్ 30న సిరిసిల్లలో నిర్వహించే సీఎం రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ ద్వారా గత 1,000 రోజుల కాంగ్రెస్ పాలనలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, భవిష్యత్‌లో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లే కార్యాచరణను ప్రజలకు వివరించనున్నట్లు విప్ తెలిపారు..

**సభా స్థలిని పరిశీలించిన విప్**
సన్నాహక సమావేశం అనంతరం ఆది శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్, ఎస్పీ మహేష్ బి. గీతేతో కలిసి సీఎం సభ నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లు, భద్రత, పార్కింగ్, ట్రాఫిక్ తదితర అంశాలపై అధికారులతో చర్చించినట్లు తెలిపారు. ఈ సన్నాహక సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సూరదేవరాజు, కౌన్సిలర్లు ఆడపు చంద్రకళ కూరపాటి శ్రీశైలం, సుధాకర్, అన్ని మండలాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జనానికి నీటి కోసం ఆందోళన దురదృష్టకరం

## బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు

**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :**




గణేష్ నిమజ్జనానికి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించాల్సింది పోయి నీటి కోసం ఆందోళన చేయాల్సిన పరిస్థితి కల్పించడం దురదృష్టకరమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం రోజు ఎస్‌బీఎస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... చింతకుంట కెనాల్‌కు ఎస్సారెస్పీ నుంచి నీరు విడుదల చేయాలని మేయర్, డిప్యూటీ మేయర్ తరఫున లిఖితపూర్వకంగా కోరినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. వెయ్యికి పైగా భారీ విగ్రహాలు నిమజ్జనం కానున్న నేపథ్యంలో నీటి విడుదల కోసం బండి సంజయ్‌కుమార్ సూచనల మేరకు బీజేపీ కెనాల్ వద్ద ఆందోళన చేపట్టిందన్నారు. ఆందోళన అనంతరం ప్రభుత్వం నీటిని విడుదల చేసిందని తెలిపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో లైటింగ్, బారికేడింగ్, క్రేన్లతో ఏర్పాట్లు పూర్తిచేశామని, నిమజ్జనానికి అవసరమైన నీటి సౌకర్యం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. అన్ని వర్గాల పండుగలకు సమాన ప్రాధాన్యం ఇచ్చి అవసరమైన ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు పొన్నం లక్ష్మి-మొండయ్య, రామన్, తోట అనిల్, ఒంటెల సత్యనారాయణ రెడ్డి, దేశ శిల్ప వేదం, సోమిడి వేణు, మాసం గణేష్, కో-ఆప్షన్ సభ్యుడు బల్వీర్ సింగ్, మాజీ కార్పొరేటర్ చంద్రమౌళి, నాయకులు పండుగ నాగరాజు, భాస్కర్, కటకం లోకేష్, అక్షయ్, రాజ ప్రభాకర్, కుంభం అనిల్, అరకిల శంకర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు అరెస్టు సరికాదు

## బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోడిపల్లి గోపాల్ రెడ్డి

**కథలాపూర్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి)**



కథలాపూర్ మండల కేంద్రంలో మంగళవారం రోజు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావుని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మి నరసయ్య ని మరియు భారతీయ జనతా పార్టీ శ్రేణులతో కలిసి రైతు సమస్యలపై జడ్చర్ల ప్రాజెక్టు వెళుతున్న నేతలను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే ఒక దిక్కు రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకొని తిరుగుతున్న కాంగ్రెస్ నాయకులు ఆ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నారు రైతుల పంట పొలాలకు నీరు ఇవ్వాలని రైతుల కోరుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం కుంటి సాకులు చెప్పి నీరు అందించడం లేదు రైతులకు నీటిని వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు జూరాలకు వెళుతుంటే మధ్యలో అరెస్టు చేయడం సరికాదు రైతు సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని రైతుల పంటలకు నీరు ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అనేక సందర్భాల్లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో అమలు చేయాలని బిజెపి డిమాండ్ చేసిన ఈ రాష్ట్ర ప్రభుత్వం దానిని అమలు చేయలేదని రైతుల సమస్యలు తీర్చకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోడిపెల్లి గోపాల్ రెడ్డి హెచ్చరించారు.

# కాంగ్రెస్ పాలనలో ఎండిపోయిన గోదావరి..

**- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆందోళన.. - నిమజ్జనానికి నీళ్లు లేక భక్తుల ఇబ్బందులు..**

**- కన్నెపల్లి పంప్‌హౌస్, ఎల్లంపల్లి నీటిని వెంటనే విడుదల చేయాలని చందర్ డిమాండ్..**

**గోదావరిఖని, జనంసాక్షి :**
గోదావరి బ్రిడ్జ్ వద్ద రామగుండం మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నాయకుడు కోరుకంటి చందర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన వల్లనే నేడు గోదావరి నది పూర్తిగా ఎండిపోయిందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల పాలనలో, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా గోదావరి నదిని ఏడాది పొడవునా సముద్రాన్ని తలపించేలా నిండుకుండలా ఉంచారని కొనియాడారు. అపర భగీరథుడిలా కేసీఆర్ నీటిని అందించి మత్స్యకారులందరికీ జీవనోపాధి కల్పించారని గుర్తుచేశారు. కానీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత గోదావరి ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వినాయక నిమజ్జనోత్సవాలు జరుగుతున్న వేళ, గోదావరిలో నీళ్లు లేకపోవడంతో విగ్రహాలను ఎక్కడ నిమజ్జనం చేయాలో తెలియక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితిపై బిఆర్ఎస్ పార్టీ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, ఎల్లంపల్లిలో నిల్వ ఉన్న నీటిని వెంటనే గోదావరిలోకి విడుదల చేయాలని, కన్నెపల్లి పంప్‌హౌస్‌ను వెంటనే ప్రారంభించాలని కోరారు.



# రాష్ట్రస్థాయి ఉషా క్రీడల్లో సాన్వి విద్యార్థుల జయకేతనం

**శాన్వి విద్యాసంస్థల చైర్మన్ ఎర్రం శెట్టి మునిందర్**

**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :**
ఈనెల19, 20వ తేదిలలో మహబూబబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్ర స్థాయి 4వ ఉషా క్రీడ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తరఫున పాల్గొన్న కరీంనగర్ రేకుర్తి సాన్వి కళాశాల (డిఫెన్స్ అకాడమీ) విద్యార్థులు పలు విభాగాల్లో పథకాలు సాధించారు. ఈ సందర్భంగా కరీంనగర్ – రేకుర్తి శాన్వి విద్యాసంస్థల చైర్మన్ ఎర్రంశెట్టి మునిందర్ మాట్లాడుతూ... పలు విభాగాల్లో పోటీపడి కరీంనగర్ జిల్లాను ఓవరాల్ ఛాంపియన్ గా మా శాన్వి విద్యార్థులు నిలబెట్టారని తెలిపారు.




**పథకాలు సాధించిన మా విద్యార్థుల వివరాలు**
యు.మహిమ రాణి, రెడ్డి భానుశ్రీ, అయిలి నిశాంత్, చిపిరిశెట్టి వేద వ్యాస్, రుద్రారపు సాయి చరణ్, ఆడెపు ఆత్రేయ లు బంగారు పతకాలు సాధించారు. అలాగే దాసరి నందిని, మడప రక్షిత, గుండెటి లక్ష్మీ ప్రసన్న , పొన్నాల హర్షవర్ధన్, జి వికాస్ బాబు రజిత పథకాలు,ఏ. నవదీప్, ఎగుల హర్షవర్ధన్, ఆడెపు అత్రేయ, గుడికందుల అనుశ్రీ లు కాంస్య పతకాలు సాధించారని కళాశాల చైర్మన్ ఎర్రంశెట్టి మునిందర్ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను, శిక్షకులు శ్రీనివాస్, స్వర్ణ లను కళాశాల ప్రాంగణం లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో చైర్మన్ ఎర్రంశెట్టి మునిందర్ ప్రత్యేకంగా సన్మానించారు. జాతీయ స్థాయి ‘ఉషు’క్రీడా పోటీలకు సాన్వి విద్యార్థులు అక్టోబర్ నెలలో చెన్నై లో జరిగే 25వ జాతీయ ఉషు పోటీలకు తెలంగాణ రాష్ట్రం తరఫున సాన్వి కళాశాల కరీంనగర్ కు చెందిన విద్యార్థులు మహిమారాణి, భానుశ్రీ, నిశాంత్, సాయిచరణ్, వేధవ్యాస్, అత్రేయలు ఎంపిక అయ్యారని చైర్మన్ మునిందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, వ్యాయామశిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కబ్జాకు గురైన భూముల పై శ్వేత పత్రం విడుదల చేయాలి

**బి,ఆర్,ఎస్ పార్టీజిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య**

**సిరిసిల్ల టౌన్ సెప్టెంబర్ 22 (జనం సాక్షి)**
రాష్టం లో కాంగ్రెస్ పార్టీ రాక్షస పాలన సాగిస్తుందని బి,ఆర్,ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య అన్నారు. సిరిసిల్లలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొన్నటి రోజున అసెంబ్లీ లో సిరిసిల్ల లో 8 వేల ఎకరాలు కబ్జా చేశారని సి,యం రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడడం జరిగిందన్నారు.8 వేల ఎకరాలు తో పాటు రికవరీ చేశామన్న 2400 ఎకరాలపై శ్వేత పత్రం విడుదల చేయాలని,వీటి వివరాలు గ్రామాల వారీగా,పేర్లతో వివరాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు.దీనిపై న్యాయపోరాటం చేస్తామని, ఆర్టీ ఐ ద్వారా సమాచారం తీసుకుంటున్నామన్నారు.లేని యెడల సిరిసిల్ల ప్రజలకు క్షమాపణ చెప్పాలని,అంబేద్కర్ చౌరస్తాలో ముక్కు నేలకు రాయాలన్నారు.విప్ ఆది శ్రీనివాస్ పగటి కలలు కంటున్నారని , కేసీఆర్, కే టి ఆర్ పై ఆరోపణలు చేయడం పై మండి పడ్డారు.కేసీఆర్ కాలి గోటికి సరిపోరని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసి ఆర్, కేటీఆర్ పై ఆరోపణలు చేస్తే సహించబోమని




హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల కు వచ్చి,8 వేల ఎకరాల వివరాలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్,బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, చిక్కాల రామారావు, ఎంసీఏ చైర్పర్సన్ జిందం కళ, వైస్ చైర్మన్ దార్ల సందీప్, కుంభాల మల్లారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా దేవునూరి నరేష్

**ఎస్సీ సెల్‌ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తా: నరేష్**

**శంకరపట్నం, సెప్టెంబర్ 22 (జనం సాక్షి):**
శంకరపట్నం మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గద్దపాక అంబేద్కర్ నగర్‌కు చెందిన దేవునూరి నరేష్ నియమితులయ్యారు.




మండల స్థాయిలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.ఈ సందర్భంగా దేవునూరి నరేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే టీపీసీసీ మెంబర్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, శంకరపట్నం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారి తిరుపతి, టీపీసీసీ స్టేట్ జనరల్ సెక్రటరీ సముద్రాల లక్ష్మణ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి కనకం విద్యాసాగర్, డీసీసీ వైస్ చైర్మన్ దుబ్బాసి కుమార్, జిల్లా కార్యదర్శి బొజ్జ చంద్రమౌళి తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.గత కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేస్తున్న తన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించిన డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని నరేష్ పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను పూర్తి నిబద్ధతతో నిర్వహిస్తానని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఎస్సీ సెల్ గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి, పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. ఎస్సీ వర్గాల సమస్యలు, అవసరాలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ఎస్సీ సెల్‌ను గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు మరింత చురుకుగా పనిచేసేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు.పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానని దేవునూరి నరేష్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# చేయూత పింఛన్ల అర్హతపై ఇంటింటా విచారణ..

**514 ఆన్‌లైన్ దరఖాస్తుల పరిశీలన.. అర్హులు, అనర్హుల గుర్తింపు**

**గంభీరావుపేట, సెప్టెంబర్ 22 జనంసాక్షి;**
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంతో పాటు వివిధ గ్రామాల్లో ఆన్‌లైన్‌లో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి అర్హత, అనర్హతలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 514 మంది పింఛన్ కోసం



ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీవో రాజేందర్ తెలిపారు. మండల పరిధిలో ఐదుగురు వెరిఫికేషన్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు.దరఖాస్తుల పరిశీలనలో భాగంగా మంగళవారం రోజు ఆన్‌లైన్‌లో పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు అధికారులు వెళ్లి కుటుంబ వివరాలు, అర్హత ప్రమాణాలను పరిశీలించి సమాచారాన్ని సేకరించారు. ఈ సందర్భంగా వెరిఫికేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ దరఖాస్తులపై విచారణ పూర్తి చేసి అర్హులైన వారికి పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

# గన్నేరువరంలో పారిశుధ్యం అస్తవ్యస్తం

**దోమల బెడదతో కాలనీవాసుల అవస్థలు**

**గన్నేరువరం, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):**
గన్నేరువరం మండలకేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీలో పారిశుధ్య పరిస్థితి దారుణంగా తయారైంది. వర్షం నీరు నిల్వ ఉండడంతో పాటు, మురుగునీరు పోయే దారి



లేక కాలనీలోనే నిలిచిపోతోంది. దీంతో కాలనీలో దోమలు విపరీతంగా పెరిగిపోయి, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ ఇరువైపులా పిచ్చి గడ్డి, ముళ్ల పొదలు పెరగడంతో మురికి కాలువలో నీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ సమస్యపై పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించి, డ్రైనేజీలను శుభ్రం చేసి, దోమల మందు పిచికారీ చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## గౌడ సంఘానికి పెద్ద మనసు చాటిన రిటైర్డ్ ఎస్సై బుర్ర ఎల్లయ్య గౌడ్

**- కమాన్ నిర్మాణానికి రూ.20 వేల విరాళం!**

**గౌడ సంఘం కమాన్ నిర్మాణానికి రిటైర్డ్ ఎస్సై బుర్ర ఎల్లయ్య గౌడ్ దంపతుల భారీ విరాళం**



గన్నేరువరం, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): సమాజ సేవలోనూ తనదైన ముద్ర వేస్తున్నారు రిటైర్డ్ ఎస్సై బుర్ర ఎల్లయ్య గౌడ్. ఉద్యోగంలో ఉన్నప్పుడే కాదు, పదవీ విరమణ తర్వాత కూడా సేవా గుణాన్ని చాటుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. గన్నేరువరం గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కమాన్ నిర్మాణానికి తన వంతు సహకారంగా రిటైర్డ్ ఎస్సై బుర్ర ఎల్లయ్య గౌడ్ – సంధ్యారాణి దంపతులు రూ.20,000 విరాళాన్ని మంగళవారం నాడు అందజేశారు. గౌడ కుల బాంధవుల ఐక్యతకు, గౌరవానికి ప్రతీకగా నిర్మిస్తున్న ఈ కమాన్ కోసం దాతలు ముందుకు రావడం అభినందనీయమని, ఇలాంటి దాతల వల్లనే సంఘం మరింత బలోపేతం అవుతుందని గౌడ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విరాళం అందజేసిన బుర్ర ఎల్లయ్య గౌడ్ దంపతుల కుటుంబానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దాతల కుటుంబంపై ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, వారి కుటుంబం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సర్వీసులో సింహం... సమాజ సేవలోనూ సింహమే! అని గ్రామస్తులు ప్రశంసిస్తున్నారు.



## భూభారతి రీ-సర్వేకు రైతులు సహకరించాలి

**శంకరపట్నం, సెప్టెంబర్ 22 (జనం సాక్షి):** భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపడుతున్న భూభారతి రీ-సర్వేకు రైతులందరూ సహకరించాలని రెవెన్యూ అధికారులు కోరారు. శంకరపట్నం మండలం కరీంపేట గ్రామంలో మంగళవారం భూభారతి రీ-సర్వేపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. గ్రామంలో భూముల సమగ్ర వివరాలను సేకరించి, భూముల హద్దులు, విస్తీర్ణం, హక్కులు తదితర అంశాలను పక్కాగా నమోదు చేసేందుకు రీ-సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. రీ-సర్వే సమయంలో రైతులు తమ భూములకు సంబంధించిన పత్రాలు, వివరాలను అధికారులకు అందించి సహకరించాలని సూచించారు. సర్వే ప్రక్రియ పూర్తయితే భూ రికార్డుల్లో స్పష్టత ఏర్పడి, భవిష్యత్తులో భూ హద్దులు, యాజమాన్య హక్కులు, ఇతర భూ సంబంధిత సమస్యలు తగ్గే అవకాశం ఉందన్నారు.రైతులు రీ-సర్వేకు సంబంధించి తమకు ఉన్న సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని, సర్వే బృందాలకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. భూముల వివరాల నమోదు ప్రక్రియలో ఎలాంటి తప్పులు లేకుండా రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు.కార్యక్రమంలో ఏడీ కిషన్‌రావు, తహసీల్దార్ కే. సురేఖ, మండల వ్యవసాయ అధికారి వెంకటేష్, సర్వేయర్ మనోజ్‌రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాములు, ఏఎంసీ వైస్‌చైర్మన్ నాంపల్లి తిరుపతి, సర్పంచ్ ఎగ్గని శ్రీలత, ఉపసర్పంచ్ రాజేశం, ఏఈఓ ప్రవంతి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## హెల్తీ మరియు న్యూట్రీస్ ఫుడ్ ప్రాక్టీస్ పై అవగాహన

మల్యాల సెప్టెంబర్ 22 (జనం సాక్షి) ముత్యంపేట మూడవ సెంటర్లో పోషణ మాసంలో భాగంగా పోషణ మాసం కార్యక్రమంను ఉద్దేశించి అంగన్వాడి టీచర్ పిల్లలుకు తల్లులు మరియు కుటుంబంల్లో హెల్తీ మరియు న్యూట్రిస్ ఫుడ్ ప్రాక్టీస్ పై అవగాహన కల్పించి ఇంట్లో సులభంగా తయారు చేసుకోగల సింపుల్ మరియు న్యూట్రిస్ రెసిపీస్ ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ తాళ్ల శోభారాణి పిల్లలు తల్లులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి ఆర్జికి అధికారుల స్పందన..

**వినాయక నిమజ్జన చెరువు పరిశీలన**

**పెద్ద కొడప్గల్ సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వినాయకులను నిమజ్జనం చేసే ప్రాంతంలో సౌకర్యాలు కల్పించాలని సోమవారం ప్రజావాణిలో బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు మంగళవారం చెరువు వద్దకు చేరుకొని స్థలాన్ని పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బీఆర్ అభినవ్ చందర్, ఎస్ఐ అరుణ్ కుమార్, ఎంపీఓ లక్ష్మీకాంత్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



## ఎస్సై జ్యోతిని సన్మానించిన ఆర్యవైశ్య మహిళా సంఘ సభ్యులు

**ముస్తాబాద్ సెప్టెంబర్ 22 (జనం సాక్షి)** ఎస్సై జ్యోతిని సన్మానించిన ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు. నవరాత్రి ఉత్సవాల లో భాగంగా ముస్తాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నెల కల్పిన గణపతి దేవుడికి ఆర్యవైశ్య మహిళలు సోమవారం 108 నైవేద్యాలను సమర్పించారు. అనంతరం ఎస్సై జ్యోతి వినాయకుడి వద్దకు వచ్చి పూజలు నిర్వహించారు. ఎస్సై జ్యోతిని ఆర్యవైశ్య మహిళ సంఘం సభ్యులు ఘనముగా సన్మానించి జ్ఞాపకను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు కూర సంతోష్, గౌరవ అధ్యక్షులు కూర బిక్షపతి, కార్యదర్శి పప్పుల శ్రీకాంత్, ఆర్య వైశ్య నాయకులు బండారి సత్తయ్య, మేడిశెట్టి రాజు, కాసన గోట్టు శ్రీనివాస్, పడమటింటి శంకరయ్య, ఆర్యవైశ్య మహిళా సభ్యులు మంజుల, జయ లక్ష్మి, పద్మజ, లావణ్య, అన్నపూర్ణ, హిమ బిందు, రజిత, సరిత, లక్ష్మి, దివ్య , వీరజ, దుర్గ వీణ, వీరమని, సంధ్య, రాణి, భవాని, లత, రాధ, విజయ, పద్మ, స్వప్న, గోదావరి, సరళ, వరలక్ష్మి, నవ్య, ప్రియాంక, వీణ, రజిని, భాగ్య, మరి కొంతమంది ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

## యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా షాహిద్ భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాడుదాం

**బోధన్, సెప్టెంబర్ 22 ( జనంసాక్షి ) :** బోధన్ పట్టణంలోని బీటి నగర్ లో గల ప్రభుత్వ హైస్కూల్లో భగత్ సింగ్ 119వ వర్ధంతి సందర్భంగా అమెరికా సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ పి డి ఎస్ యు పివైఎల్ పి ఓ డబ్ల్యు ల ఆధ్వర్యంలో మంగళవారం సదస్సును నిర్వహించారు. సదస్సుకు పి ఓ డబ్ల్యు పట్టణ అధ్యక్షురాలు మీ నాగమణి అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో ముఖ్య భక్తుగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ బోధన్ డివిజన్ కమిటీ సహాయ కార్యదర్శి బి.మల్లేష్ మాట్లాడుతూ, అమెరికా ఆధిపత్య ధోరణులు, యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. షాహిద్ భగత్ సింగ్ చూపిన ధైర్యం, త్యాగం, సామాజిక మార్పు కోసం సాగించిన పోరాట స్ఫూర్తితో యువత, విద్యార్థులు, మహిళలు ముందుకు సాగాలని, ప్రపంచంలో శాంతి, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం ప్రజల ఐక్య పోరాటాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి ఓ డబ్ల్యు పట్టణ అధ్యక్షురాలు బి. నాగమణి, పి డి ఎస్ యు జిల్లా మాజీ నాయకురాలు ఎస్. మౌనిక, టి యు సి ఐ పట్టణ నాయకులు ఎండి ఇర్షాద్, పి వై ఎల్ పట్టణ నాయకుడు డి నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్,వీడీసీ కమిటీ

**ఇందల్వాయి జనంసాక్షి** ఇందల్వాయి మండల కేంద్రంలోని ఇందల్వాయి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రామ సర్పంచ్ లోకని గంగామణి గంగారం, ఉప సర్పంచ్,విడిసి చైర్మన్ రియాజ్,వైస్ చైర్మన్ బాగిర్తి నారాయణలు మంగళవారం విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు.అనంతరం గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థిని,విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలలో,సాంకేతిక రంగాలలో సైతం రాణించాలని విద్యార్థిని విద్యార్థులకు సూచించారు, రానున్న భవిష్యత్తు కాలంలో ఇందల్వాయి పాఠశాలను జిల్లా స్థాయిలో అన్ని విధాల అన్ని రంగాలలో మంచి స్థాయిలో నిల్వాలని ఆకాంక్షించారు, విద్యార్థులు ఈ దశ నుండే ప్రపంచంతో పోటీపడేలా పట్టుదలతో ముందుకెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లోకని గంగమని గంగారం, ఉప సర్పంచ్ మోత్కూరి శ్రీనివాస్ గౌడ్, మాజీ మండల అధ్యక్షులు,నవీన్ గౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ రియాజ్, వైస్ చైర్మన్ బాగిర్తి నారాయణ, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట ఆడుతున్న వ్యక్తులపై కేసు నమోదు



**మేడిపల్లి,(జనంసాక్షి):** జగిత్యాల జిల్లా మేడి పల్లి మండలం కట్లెల కుంట గ్రామంలోని ఎస్సీ మాల సంఘం భవనంలో తేదీ 22.09.2026 రోజున అర్ధరాత్రి కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు అర్ధరాత్రి పోలీస్ సిబ్బందితో కలిసి పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పట్టుకొని కేసు నమోదు చేయడం జరిగిందనీ వారి వద్ద నుంచి 8,740 రూపాయలు సీజ్ చేసామనీ, సంఘ భవనాలలో, గణేష్ విగ్రహాల దగ్గర పేకాటలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయనీ మేడిపల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డి హెచ్చరించారు.

## ఎస్ఐ హామీతో దీక్ష విరమించిన అనంతారం యువకుడు అక్కెం నాగరాజు



ఇల్లంతకుంట, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): ఇల్లంతకుంట మండలం అనంతారం బిక్కవాగుపై అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ గత రెండు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న అనంతారం గ్రామ యువకుడు అక్కెం నాగరాజు స్థానిక ఎస్ఐ ఉపేంద్రచారి హామీతో మంగళవారం దీక్ష విరమించారు.– దీక్ష విరమించే సమయంలో బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని, రెండు వైపులా అప్రోచ్ రోడ్డు పనులను కూడా చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా బ్రిడ్జిని వినియోగంలోకి తీసుకువస్తామని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ ఎస్ఐ సమక్షంలో హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు పనులను ఆలస్యం చేయకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. ఎస్ఐ ఉపేంద్రచారి ఇచ్చిన హామీని, ఆయన సమక్షంలో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ ఇచ్చిన స్పష్టమైన హామీని గౌరవిస్తూ దీక్ష విరమించినట్లు తెలిపారు. హామీ మేరకు బ్రిడ్జి పనులు ప్రారంభించి పూర్తి చేయడంలో మళ్లీ జాప్యం జరిగితే చుట్టుపక్కల నాలుగు గ్రామాల ప్రజలు, యువతతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ జోగిందర్ సింగ్, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ యువత, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 7న అమరావతిలో నూతన మండల కమిటీల జాతీయ సదస్సు

## సిరికొండ మండల కమిటీ భారీగా తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉండాలి: మొట్టల దీపక్ మాదిగ

**సిరికొండ, సెప్టెంబర్ 22(జనంసాక్షి ):** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు అక్టోబర్ 7న అమరావతిలో నిర్వహించనున్న నూతన మండల కమిటీల జాతీయ సదస్సుకు సిరికొండ మండల కమిటీ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని ఎమ్మార్పీఎస్?ఎంఎస్పీ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సదస్సుకు పెద్ద సంఖ్యలో తరలివెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు వైట్ షర్ట్, బ్లాక్ ప్యాంట్ డ్రెస్ కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలని నిర్ణయించారు. చిన్న సమావేశమైనా, పెద్ద కార్యక్రమమైనా డ్రెస్ కోడ్‌ను పాటిస్తూ ఉద్యమ క్రమశిక్షణ, ఐక్యతను చాటాలని నాయకులు పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ 32 ఏళ్ల ఉద్యమ ప్రస్థానాన్ని నాయకులు గుర్తుచేసుకున్నారు. ఆరోగ్యశ్రీ, వికలాంగులు, వితంతువుల పింఛన్లు తదితర ప్రజా సమస్యలపై మందకృష్ణ మాదిగ చేసిన పోరాటాలను ప్రస్తావిస్తూ, ఉద్యమం సాధించిన హక్కులు, విజయాలను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్ కార్యక్రమాల్లో మరింత ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ నెల 2న సిరికొండ మండల ఎమ్మార్పీఎస్ కమిటీ ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తూ, రాబోయే కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని కోరారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ మొట్టల దీపక్ మాదిగ మాట్లాడుతూ, అక్టోబర్ 7న అమరావతిలో జరిగే నూతన మండల కమిటీల జాతీయ సదస్సుకు సిరికొండ మండల కమిటీ పెద్ద సంఖ్యలో తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఉద్యమ క్రమశిక్షణను పాటిస్తూ డ్రెస్ కోడ్‌లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు



గొర్రె గణేష్ మాదిగ, అధికార ప్రతినిధి బొడ్డు తిరుపతి మాదిగ, ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల ప్రసాద్ మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు పస్కే లింగం మాదిగ, ఉపాధ్యక్షుడు దాసరపు చలపతి మాదిగ, ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు కొమ్ము సంతోష్ మాదిగ, ఎనుగంటి దిలీప్ మాదిగ, సభ్యుడు తాళ్లపల్లి మధు తదితరులు పాల్గొన్నారు.



# అనుమతులు నిల్.. నిర్మాణం ఫుల్..

**ఆర్మూర్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 1వ వార్డులో అక్రమ ఇంటి నిర్మాణం జోరుగా కొనసాగుతుంది. గతంలో నిర్మించిన ఇంటి నిర్మాణంపై మొదటి అంతస్తు కొత్త ఇంటి నిర్మాణం జరుపుతున్నారు. అదే విధంగా రోడ్డు భాగాన్ని ఆక్రమిస్తూ కమర్షియల్ షటర్ల నిర్మాణం యదేచ్చగా జరుపుతున్నారు. మున్సిపల్ చట్టం ప్రకారం ఒక ఇంటి నిర్మాణం జరపాలంటే టీఎస్ బి పాస్ లో అప్లై చేసుకోవాలి. క్రింది అంతస్తు ఇంతకుముందే నిర్మాణం జరిగి ఉంటే ప్రస్తుతం జరుగుతున్న మొదటి అంతస్తు నిర్మాణంతోపాటు ఇంటి మొత్తానికి పర్మిషన్ తీసుకోవాలి. ఇలాంటివి ఏమీ లేకుండానే వార్డు కౌన్సిలర్ అండతో అక్రమ నిర్మాణం పనులు చకచక జరుగుతున్నట్లు తెలుస్తుంది. మున్సిపల్ అధికారులు సైతం ఆ ఇంటి నిర్మాణం పై ఏలాంటి అనుమతులు ఉన్నాయో చూడకుండా వ్యవహరిస్తున్నారు. పిప్రి మార్గం వెళ్ళే రోడ్డు దారిలో నిర్మాణం జరుగుతున్న అధికారులు చలనం లేకుండా ఉంది. ఇకనైనా మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.



# ఆర్మూర్ అభివృద్ధి లక్ష్యంగా పని చేద్దాం

- నూతన కార్యాలయలకు భవన స్థల పరిశీలన..
- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి..

**ఆర్మూర్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** ఆర్మూర్ నియోజక వర్గం సంక్షేమం,అభివృద్ధి లక్ష్యంగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి వాక్యానించారు. పట్టణంలోని మార్కెట్ కమిటీ కార్యాలయం ఎమ్మెల్యే మున్సిపల్,రెవెన్యూ, మార్కెట్ కమిటీ పాలకవర్గం,అధికారులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. నూతన మున్సిపల్ కార్యాలయం నిర్మాణ కొరకు స్థలం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 7.50 కోట్లు మంజూరు చేసిందని అట్టి నిధులతో మూడు ఎకరాల స్థలంలో నూతన మున్సిపల్ భవనం నిర్మాణం చేపడతామని తెలిపారు. మార్కెట్ కమిటీ యొక్క విస్తీర్ణ 11.9 ఎకరాల భూమిలో మూడు ఎకరాల్లో మున్సిపల్, మండల,రెవెన్యూ,మహిళా పోలీస్,ట్రాఫిక్ పోలీస్ పోలీస్ కార్యాలయం ఏర్పాటు చేస్తామని వాటి నిర్మాణ నిధులు మంజూరుకై ప్రభుత్వంకు నివేదిక అందించామన్నారు. ప్రజలకు అభ్యంతరం ఉంటే అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడదామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా,ఆర్మూర్ ఎమ్మార్వో సత్యనారాయణ, జిల్లా మార్కెట్ అధికారి గంగు బాయి, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్. సెక్రటరీ పరమేశ్వర్. మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ కామారెడ్డి జిల్లాల మాదిగ మహిళా సమైక్య ఇంచార్జిగా గుమ్ముట్టు పద్మ నియామకం!



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 జనంసాక్షి:** మహాజన సోషలిస్ట్ పార్టీ, ఎంఆర్పిఎస్ అడుగుజాడల్లో మహిళా సాధికారత దిశగా అడుగులు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు,మహాజన సోషలిస్ట్ పార్టీ అభీష్టం ప్రకారం, నిజామాబాద్, కామారెడ్డి రెండు జిల్లాలకు మాదిగ మహిళా సమైక్య ఇంచార్జిగా గుమ్ముట్టు పద్మను ఆ సమైక్య రాష్ట్ర అధ్యక్షురాలు పెద్ద గీత మాదిగ అధికారికంగా మంగళవారం నాడు ప్రకటించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ దశ దిశా నిర్దేశం చేస్తూ, సమాజంలో అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం మహిళలు మరింత ముందుకెళ్లాలని, గ్రామస్థాయి నుంచి ఉద్యమాన్ని ఉద్ధృతం చేయడంలో మహిళా నాయకత్వ పాత్ర ఎంతో కీలకమని స్పష్టం చేశారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే నిజాయితీ గల నాయకులను బాధ్యతల్లోకి తీసుకురావడం ద్వారానే సంస్థ మరింత బలపడుతుందని ఆయన ఆకాంక్షించారు. మహిళా సమైక్య రాష్ట్ర అధ్యక్షురాలు పెద్ద గీత మాదిగ ఈ నియామకాలపై సూచిస్తూ, గుమ్ముట్టు పద్మ యొక్క నిబద్ధతను, ఉద్యమ పటిష్టతకు ఆమె చేస్తున్న కృషిని ప్రత్యేకంగా కొనియాడారు. రెండు జిల్లాల్లోనూ మహిళలను సంఘటితం చేస్తూ, వారి సమస్యల పరిష్కారం కోసం సమర్థవంతంగా పనిచేసి సమైక్యను మరింత బలోపేతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన ఇంచార్జి గుమ్ముట్టు పద్మ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు, రాష్ట్ర అధ్యక్షురాలు పెద్ద గీత మాదిగకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకానికి సహకరించిన మహాజన సోషలిస్ట్ పార్టీ, ఎంఆర్పిఎస్ మహిళా సమైక్య శ్రేణులకు,అలాగే జిల్లా, రాష్ట్ర, జాతీయ కార్యవర్గ నాయకులందరికీ పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు వెల్లడించారు. అందరి సమన్వయంతో మరింత అంకితభావంతో పనిచేస్తానన్నారు.

## బ్యాంకులను ఏటీఎంలను తనిఖీ చేసిన ఎస్ఐ సిహెచ్.సతీష్



**కమ్మర్పల్లి సెప్టెంబర్ 22 (జనంసాక్షి)** మండల కేంద్రంలోని వివిధ బ్యాంకులను, ఏటీఎంలను కమ్మర్పల్లి ఎస్సై సిహెచ్.సతీష్ మంగళవారం రోజున తనిఖీ చేసి భద్రతా పై బ్యాంకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఇటీవల చుట్టుపక్కల జిల్లాలో ఏటీఎంల వద్ద జరిగిన చోరీలు ఘటనలను దృష్టిలో ఉంచుకొని తనిఖీలు చేయడం జరిగింది అన్నారు. అలాగే సీసీ కెమెరాలు అలారం వ్యవస్థలు భద్రత ఏర్పాట్లు పరిశీలించి సీసీ కెమెరాలు 24 గంటల పాటు పనిచేసేలాగా బ్యాంక్ సిబ్బంది చూడాలన్నారు. ఖాతాదారులు ఓటిపి పిన్ సివివి బ్యాంక్ ఖాతా వివరాలు ఎవరితో పంచుకోవద్దని సూచించారు. ఖాతాదారులకు ఏమైనా సందేహాలు ఉంటే నేరుగా బ్యాంకుకు వచ్చి సందేహాలు తీర్చుకోవాలని సూచించారు. బ్యాంకు వద్ద అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా డయల్ 112 కు సమాచారం అందించాలని కోరారు.

# పోచారం తాండాలో పింఛన్ల దరఖాస్తులపై విచారణ

**పెద్ద కొడప్గల్ సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** మండలంలోని పోచారం తాండ గ్రామంలో చేయూత పింఛన్ల దరఖాస్తులపై మంగళవారం అధికారులు విచారణ చేపట్టారు. వెరిఫికేషన్ ఆఫీసర్ (వ్యవసాయ శాఖ మండల అధికారి) కిషన్ ఇంటింటికి వెళ్లి పింఛన్ దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారి కిషన్ మాట్లాడుతూ.. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి పూర్తిస్థాయిలో పరిశీలించడం జరిగిందని తెలిపారు. అర్హత ఆధారంగా దరఖాస్తులను పరిశీలిస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆశిష్, గ్రామస్తులు ఉన్నారు.



# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన గ్రామ శాఖ అధ్యక్షులు

- కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల పక్షపాతి
- ఇందల్వాయి గ్రామ శాఖ అధ్యక్షులు బైరి రవి




**ఇందల్వాయి జనంసాక్షి** ఇందల్వాయి మండల కేంద్రంలోని ఇందల్వాయి గ్రామంలో స్థానిక నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఆదేశానుసారంతో ఇందల్వాయి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బైరి రవి,మాజీ మండల అధ్యక్షులు మోత్కూర్ నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కు లను మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం గ్రామ శాఖ అధ్యక్షులు బైరి రవి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు దశలవారీగా తీర్చుతూ రైతులకు అండగా భరోసానిస్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డికే చెందుతుందన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సంక్షేమం కోసం మూడు సంవత్సరాలలో అత్యధిక సీఎంఆర్ఎఫ్ పందును అందించిన ఘనత కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. గతంలో ప్రభుత్వాలు ఉన్నప్పుడు ప్రజలకు ఎలాంటి అండగా నిలువలేకపోయారని అన్నారు, గతంలో సీఎంఆర్ఎఫ్ నిధుల కోసం ఎంతోమంది రాష్ట్ర ప్రజలు దరఖాస్తు చేసుకున్నప్పటికీ అరకొరగా పంపిణీ చేసేవారన్నారు. రాబోయే రోజులలో స్థానిక నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి సహకారం తో ఇందల్వాయి గ్రామానికి గ్రామ అభివృద్ధి కోసం మరిన్ని నిధులు వచ్చేలా చూస్తామని తెలిపారు ఇప్పటికే గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు సాహేందర్, మాజీ సర్పంచ్ ఆరిపెల్లి దశరథ్,యూత్ నాయకులు రఘువీర్,లబ్దిదారులు బుట్టి చిన్న గంగారం,ఎం రమేష్ నరసయ్య, గంగారం, గంగాధర్ తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.